క్లుప్తంగా

ప్రత్యేక బస్సులు నడపాలి

గద్వాల అర్బన్: విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులను నడపాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. పాఠశాలలు, కళాశాలల సమయానికి బస్సు రావడం లేదన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సులను కేటాయించాన్నారు. సమావేశంలో సతీష్, అశోక్, వెంకటేష్, అనిల్, మురళీ తదితరులు ఉన్నారు.

డాక్టరేట్ పొందిన మహిళకు సన్మానం



అయిజ: పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ పొందిన పట్టణానికి చెందిన యాసీన్‌బీని పట్టణంలో శుక్రవారం టీపీసీసీ అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి ఆచారి, పీఏసీఎస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి వేర్వేరుగా శాలువ, పూలమాలలతో సత్కరించారు. మున్సిపాలిటీలోని 19వ వార్డుకు చెందిన మహబూబీ, హుసేన్ సాహెబ్ దంపతుల కుమార్తె యాసీన్‌బీ 2018–2023 విద్యాసంవత్సరంకు సంబంధించిన గౌరవ డాక్టరేట్ పొందారు. ప్రస్తుతం గద్వాల బాలుర ఉన్నత పాఠశాలలో గ్రేడ్–2 హిందీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని మునుగాలకు చెందిన రంగన్న (60) అనారోగ్యంతో అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అబ్రహం శుక్రవారం గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు.

అయోధ్య అక్షతల అందజేత

శాంతినగర్: అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షతలను శుక్రవారం బుడమొర్సు గ్రామస్తులకు ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడు వెంకటేశ్వర్లు అందజేశారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బీకే శ్రీను, శేషన్న పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



గట్టు: మండలంలోని ముచ్చోనిపల్లెలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజను నిర్వహించారు. సర్పంచ్ గోవిందు, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ భూమి పూజలో పాల్గొన్నారు.

జాతరలో దొంగల హల్‌చల్

- మహిళల మెడలో గొలుసుల అపహరణ

మల్దకల్: మండల కేంద్రంలో లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జాతరలో మహిళలు పెద్దసంఖ్యలో రావడంతో వారి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును గుర్తు తెలియని దుండగులు అపహరించుకువెళ్లారు. దాదాపు 8మంది మహిళల మెడలో ఉన్న బంగారంను అపహరించుకుపోయినట్లు బాధిత మహిళలు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జాతరలో బంగారం చోరీ కావడంతో మహిళలు, భక్తులు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ రద్దీలో మహిళల మెడలో ఉన్న బంగారంను అపహరించినట్లు బాధిత మహిళలు శోభ, రాధ, పారిజాత తెలిపారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మసీద్ ప్రారంభం

కేటీదొడ్డి: మండలంలోని గంగన్‌పల్లిలో కొత్తగా నిర్మించిన మసీద్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సూచించిన జీవనవిధానం అనుసరిస్తే సుఖసంతోషాలతో గడుపుతామని, ప్రతిరోజు ప్రార్థన చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మనోరమ, సర్పంచ్ తిక్కన్న, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, గడ్డం కృష్ణారెడ్డి, చక్రధర్, ఉరుకుందు, తదితరులు పాల్గొన్నారు.





యాపదిన్నెలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్



మారమునగాల–2లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



శాంతినగర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

అర్హులు దరఖాస్తు చేసుకోండి

రెండో రోజు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



ముండ్లదిన్నెలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ



ఉట్కూరులో..



ఆలూరులో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అలంపూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, కమిషనర్ గోల్కొండ నరసయ్య కోరారు. మున్సిపాలిటీలోని 7, 8వ వార్డులో ప్రభుత్వ ఆరు గ్యారంటీల కోసం శుక్రవారం రెండో రోజు దరఖాస్తులను స్వీకరించారు. 7వ వార్డులోని అక్బర్‌పేటకాలనీలో ఉన్న మఠం వద్ద, 8వ వార్డులోని న్యూప్లాట్స్ కాలనీలో కమ్యూనిటీహాల్‌లో దరఖాస్తు స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రభుత్వ సందేశాన్ని ప్రజలకు చదివి వినిపించారు. అనంతరం ప్రజల నుంచి ఆరు గ్యారంటీలకు దరఖాస్తులను అందుకున్నారు. 7వ వార్డులో 325 ప్రజా పాలన దరఖాస్తులు, ఇతర 22, 8వ వార్డులో 310 ప్రజాపాలన దరఖాస్తులు, ఇతర 12 వచ్చినట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యురాలు ఖలీదా బేగం, కౌన్సిలర్లు సభినాబీ, సరోజమ్మ, నాయకులు దేవరాజు, మొక్తార్, షేక్ ఉసేన్ వలి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

570 దరఖాస్తులు

అలంపూర్ రూరల్: మండలంలోని ఉట్కూర్, కొనేరులో 570 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ మంజుల, ఎంపీఓ చంద్రకళ తెలిపారు. ఉట్కూరులో 207, కోనేరులో 363 దరఖాస్తులు వచ్చాయి. ప్రత్యేక అధికారి యాదగిరి పర్యవేక్షించారు. గొందిమళ్ల, భైరంపల్లిలో శనివారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె, పాతపాలెం పంచాయతీల్లో శనివారం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తహసీల్దార్ సరితారాణి, ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహిద్దీన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆయా పంచాయతీల ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

మానవపాడు: మండలంలోని పెద్ద ఆముదాలపాడు, నారాయణపురంలో శుక్రవారం 555 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ రమణరావు తెలిపారు. శనివారం కలుకుంట్ల, అమరవాయిలో ప్రజాపాలన గ్రామసభలు ఉంటాయని పేర్కొన్నారు.

రాజోళి: ప్రజాపాలనలో భాగంగా శుక్రవారం పెద్ద ధన్వాడలో 625, ముండ్లదిన్నెలో 255 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ గోవిందురావు తెలిపారు.

అయిజ: మున్సిపాలిటీలోని 2,7, 12, 17వ వార్డుల్లో మొత్తం 1,103 దరఖాస్తులు వచ్చాయి. మండలంలోని యాపదిన్నె, కుర్వపల్లి, నౌరోజి క్యాంప్, ఉప్పల క్యాంప్‌లో మొత్తం 1,054 దరఖాస్తులు వచ్చాయి. తహసీల్దార్ షహీదాబేగం, ఎంపీడీఓ సాయిప్రకాష్, మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ కార్యక్రమాన్ని పరిశీలించారు. శనివారం మండలంలోని చిన్న తాండ్రపాడు, మేడికొండలో దరఖాస్తుల స్వీకరణ చేపడుతామని తెలిపారు. అదేవిధంగా మున్సిపాలిటీలోని వార్డు నంబర్ 3, 8, 18,13 వార్డుల్లో అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు.

పూర్తి వివరాలు నింపండి

శాంతినగర్: వడ్డేపల్లి పుర ప్రజలందరూ ప్రజాపాలనలో ఇచ్చే దరఖాస్తుల్లో పూర్తి సమాచారం నింపి అందజేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శాంతినగర్‌లో పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన దరఖాస్తులు స్వీకరించారు. మూడు, నాలుగు వార్డుల వారు దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ ఆంజనేయులు, మేనేజర్ అబ్దుల్ సలాంబాషా, తోట హనుమంతు పాల్గొన్నారు.

కొనసాగిన ప్రజాపాలన

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లోని బీచుపల్లిలో 151, వేములలో 187, శివనంపల్లిలో 48, శనిగపల్లిలో 57 దరఖాస్తులు వచ్చాయి. బీచుపల్లిలో మాజీ ఎంపీ మందా జగన్నాథం ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించి దరఖాస్తులను పరిశీలించి తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, నందిని, ఎంపీడీఓ రాఘవ, ఎంపీఓ భాస్కర్, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

గట్టు: ఆలూరు, వాయిల్‌కుంటతండా, అంతంపల్లిలో అధికారులు గ్రామ సభలను నిర్వహించారు. రెండో రోజు మొత్తం 1,279 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

కేటీదొడ్డి: మండలంలోని ఇర్కిచేడు, గంగన్‌పల్లిలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ సరితారాణి తెలిపారు. రెండు గ్రామాలలో 1,018 దరఖాస్తులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎంపీపీ మనోరమ హాజరై దరఖాస్తులు స్వీకరించారు.

1,037 దరఖాస్తులు

మల్దకల్: మండలంలోని అడవిరావల్‌చెర్వు, ఉలిగేపల్లి, నేతువానిపల్లి, మద్దెలబండపెద్దతండాలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆయా గ్రామాలలో 1,037 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.

ఉండవెల్లి: మారమునగాల–1, 2 పంచాయతీలో ప్రజాపాలన కార్యక్రమాన్ని సర్పంచ్ సునీత ఆధ్వర్యంలో ప్రారంభించారు. మొత్తం 495 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ పద్మావతి, తహసీల్దార్ వెంకట్రావ్ తెలిపారు.



గంగన్‌పల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ మనోరమ



మల్దకల్ మండలం అడవిరావుల్‌చెర్వులో..



బీచుపల్లిలో పరిశీలిస్తున్న మాజీ ఎంపీ మందా జగన్నాథం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఇర్కిచేడులో దరఖాస్తులను స్వీకరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని జెడ్పీచైర్‌పర్సన్ సరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 8వ వార్డులో ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు.

ధరూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మార్లబీడులో రైతువేదిక వద్ద దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

కేటీదొడ్డి: ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలపై అధికారులు నిర్లక్ష్యం చేయరాదని జెడ్పీచైర్‌పర్సన్ సరిత సూచించారు. మండలంలోని ఇర్కిచేడు,గంగన్‌పల్లిలోని రైతు వేదిక వద్ద అధికారులు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో పాల్గొని దరఖాస్తులను పరిశీలించి మాట్లాడారు.

బీఆర్‌ఎస్ అవినీతి వల్లే అప్పుల పాలు: మందా

ఎర్రవల్లిచౌరస్తా: సంక్షేమ పథకాల పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతి చేయడం వల్లే రాష్ట్రం అప్పుల పాలైందని మాజీ ఎంపీ మందా జగన్నాథం విమర్శించారు. శుక్రవారం ఎర్రవల్లి మండలంలోని కొండేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దొరల నిరంకుశ పాలన నుంచి రాష్ట్ర ప్రజలు విముక్తి చెందారన్నారు. గత ముఖ్యమంత్రి ప్రజాధనంతో నిర్మించుకున్న ప్రగతిభవన్‌ను ప్రజల కోసం ప్రజాభవన్‌గా మార్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో చెప్పినట్లుగానే ప్రజల కోసం, ప్రజలచేత రాష్ట్రంలో ప్రజాపాలన సాఫీగా కొనసాగిస్తుందన్నారు. గతంలో రూ.16వేల కోట్లు ఉన్న రాష్ట్ర అప్పును బీఆర్‌ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లలో బంగారు తెలంగాణ పేరుతో రూ.7లక్షల కోట్లకు ఎగబెట్టి అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. అవినీతి చేసి నాణ్యతలేని కాళేశ్వరం ప్రాజెక్టును కట్టి బీఆర్‌ఎస్ పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కాకముందే బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ నడిగడ్డ అభివృద్ధి కోసం రూ.వందల కోట్లు ఇస్తామని చెప్పి నట్టేట ముంచారన్నారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం దిగ్విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రవి, వెంకటేష్‌యాదవ్, సోమనాద్రి, నీలి శ్రీను, వెంకటేష్, యువరాజ్, శ్యామ్, యోహాన్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వ్యవసాయశాఖ నివేదికలను చదివి వినిపిస్తున్న ఏఓ రాధ

శాంతినగర్: సభ్యులు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని ఎంపీపీ రజిత అన్నారు. వడ్డేపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రజిత అధ్యక్షతన ఐకేపీ భవనంలో శుక్రవారం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు వారి శాఖకు సంబంధించిన తాజా నివేదిలను చదివి వినిపించారు. వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వారి గ్రామాల సమస్యలను వివరించారు. తిమ్మాజిపల్లి ఉపసర్పంచ్ ఆంజనేయులు విద్యుత్ సమస్యపై చర్చించారు. వారి గ్రామానికి బుడ్డారెడ్డిపల్లి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతోందని, లో ఓల్టేజి, తరుచూ సమస్యలు వస్తున్నాయని, రామాపురం లేదా శాంతినగర్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా ఇవ్వాలని కోరారు. మండల ప్రజలకు అవసరమైన మందులు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అందుబాటులో ఉండటంలేదని, రోగులకు ఉచితంగా అందేవిధంగా చర్యలు తీసుకోవాలని డాక్టర్‌కు వివరించారు. కోయిల్‌దిన్నెకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏబీ స్విచ్ లేకపోవడంతో తరచూ ఎల్‌సీ తీసుకోవాల్సి వస్తుందని, ఏబీ స్విచ్ ఏర్పాటు చేయాలని ఉప సర్పంచ్ పుల్లారెడ్డి కోరారు. ఎంఈఓ నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కొందరు ఆకతాయిలు చేరి మద్యం తాగి విద్యార్థులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తున్నారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎంపీపీ సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తెలిపి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రవీంద్ర, తహసీల్దార్ జ్యోతి, ఎంఈఓ నరసింహ, ఏఓ రాధ, వెటర్నరి డాక్టర్ పుష్పలత, ఏఈలు సుబ్బరాయుడు, లక్ష్మీనారాయణరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సరస్వతీ దేవికి అభిషేకం, కుంకుమార్చన చేశారు. భక్తులు ఉదయాన్నే బీచుపల్లికి చేరుకుని దర్శించుకున్నారు. అదేవిధంగా ఎర్రవల్లిచౌరస్తాలోని శివాంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడి ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహించారు.

ఆరుతడిలో మినుము సాగు లాభదాయకం



పుటాన్‌దొడ్డిలో మినుము పంటను పరిశీలిస్తున్న ఏడీఏ సక్రియనాయక్

ఎర్రవల్లిచౌరస్తా: ఆరుతడి పంటలలో మినుము సాగు రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని ఏడీఏ సక్రియనాయక్ అన్నారు. శుక్రవారం ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డి, సాసనూలు, కారుపాకుల గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో రైతులు యాసంగిలో అధికంగా సాగు చేసిన మినుము పంటలను రైతులతో కలిసి సందర్శించి చీడపీడల నివారణ, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. జూరాలలో సాగు నీరు తక్కువగా ఉన్నందున రైతులు ఆరుతడి పంటలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆరుతడి పంటలలో రైతులు మినుము, మొక్కజొన్న పంటలను అధికంగా సాగుచేసి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని పొందవచ్చునని తెలిపారు. ప్రతి రైతు యాసంగిలో వరి పంటకు బదులుగా మినుము, మొక్కజొన్న సాగు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ హిమబిందు, రైతులు వెంకటన్న, రవికుమార్ తదితరులు ఉన్నారు.

‘మాంటిస్సోరి’లో వింటర్ ఫెస్ట్



విద్యార్థుల నృత్య ప్రదర్శన

అలంపూర్: పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ శుక్రవారం వింటర్ ఫెస్ట్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాగలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక, ఆధునిక నృత్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ విద్యార్థులు వింటర్ ఫేస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా మొదటి రోజు కర్టన్ రైజర్, రెండో రోజు ఇంగ్లిష్ నైట్, మూడో రోజు ఫన్ గేమ్స్ మ్యాజిక్ షో, నాల్గవ రోజు కొత్త సంవత్సరం వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కాకుండా సాంస్కృతిక విలువతోపాటుగా ఆధునికతను స్వీకరించాలన్నారు. పాఠశాల డైరెక్టర్ రవి ప్రకాశ్ ప్రదర్శనలతో అలరించిన విద్యార్థులను అభినందించారు.

నిర్మించి.. వదిలేశారు

- అందుబాటులోకి రాని బస్టాండ్
- చౌరస్తాలోనే బస్సుల నిలుపుదల



ధరూరులో నిరుపయోగంగా బస్టాండ్

ధరూరు: రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకు రావడంలో అధికార యంత్రాగం పూర్తిగా విఫలమవుతుంది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం మండల కేంద్రంలో రూ.14 లక్షల వ్యయంతో బైపాస్ రోడ్డులో బస్టాండును నిర్మించారు. ప్రారంభించి ప్రయాణికులకు ఉపయోగపడేలా చూడాల్సిన అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో నిలువ నీడ లేని చౌరస్తా వద్ద ప్రయాణాలు కొనసాగించాల్సిన పరిస్థితి దాపురించింది. ఏడెనిమిదేళ్ల క్రితం కొన్నాళ్ల పాటు ఆర్టీసీ కంట్రోలర్‌ను నియమించి బస్సులు ఆపారు. ఆ తర్వాత దాని ఊసే ఎత్తడం లేదు. గద్వాల నుంచి రాయచూరు వరకు 50కి.మీ. పొడవునా ఎక్కడా బస్టాండ్లు లేవు. తాగునీరు కూడా దొరకని పరిస్థితి ఉంది.

తప్పని అవస్థలు..

మండల కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాల వారు నిత్యం వందలాది మంది ధరూరు మీదుగా గద్వాల, రాయచూరు ప్రాంతాలకు ప్రయాణాలు కొన సాగిస్తుంటారు. వైఎస్సార్ చౌరస్తా వద్దనే బస్సులు, జీపులు, ఆటోలు ఆగి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నారు. బస్టాండు పక్కనే ఉన్నా అక్కడ బస్సులు ఆపడం లేదు. నిలువ నీడ లేని ప్రాంతంలో ప్రయాణికులు ఎండలో వేచి ఉండి వాహనాల్లో వెళ్తున్నారు. రద్దీ పెరుగుతున్నా ప్రయాణీకులకు తగు సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకోవడం లేదు.

బస్టాండ్‌లో ఆపాలి



బస్టాండ్‌లో బస్సులు ఆపేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎండలకు, వర్షానికి నిల్చుని ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. బస్టాండ్‌ను ఉపయోగంలోకి తెస్తే సమస్యలు ఉండవు. ఏళ్ల తరబడిగా ఉన్న సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి.

– నాగరాజు, ధరూరు

బస్సులు నిలిపేలా చూస్తాం



కంట్రోలర్ ఏర్పాటు కుదరదు. ఎవరినైనా ఏర్పాటు చేసి బస్సులు బస్టాండులోనే ఆపేలా చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

– మంజుల, ఆర్టీసీ డీఎం, గద్వాల

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగుళాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com